క్లుప్తంగా

ముగిసిన పది పరీక్షలు



పరీక్ష కేంద్రం నుంచి బయటికొస్తున్న విద్యార్థులు

షాద్‌నగర్: పదో తరగతి వార్షిక పరీక్షలు ముగిశాయి. విద్యాశాఖ అధికారులు పక్కా ప్రణాళికతో ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించారు. బుధవారం నిర్వహించిన సాంఘీక శాస్త్రం పరీక్షకు మొత్తం 2,472 మంది విద్యార్థులకు గాను 2,464 మంది విద్యార్థులు హాజరయ్యారు. 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి మనోహర్ తెలిపారు.

హెచ్‌ఎంకు సన్మానం



విశ్రాంత హెచ్‌ఎంను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ఇటీవల పదవీ విరమణ పొందిన హెచ్‌ఎం భాగ్యవతిని బుధవారం బీజేపీ నాయకులు ఘనంగా సత్కరించారు. భాగ్యవతి చౌడాపూర్ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎంగా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో నాయకులు షాద్‌నగర్‌లోని ఆమె నివాసంలో భాగ్యవతి, రాచప్ప దంపతులను శాలువా కప్పి, పూల మాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, చేగు సుధాకర్, రంగన్నగౌడ్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మారిన వ్యవసాయ అధికారుల నంబర్లు

ఏడీఏ రాజారత్నం

కేశంపేట: షాద్‌నగర్ పరిధిలోని వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయ పరిధిలోని అధికారుల ఫోన్ నంబర్లు మారినట్టు ఏడీఏ రాజరత్నం తెలిపారు. ఏడీఏ షాద్‌నగర్ 8977753901, ఏఓ టెక్ షాద్‌నగర్ 8977753902, ఫరూఖ్‌నగర్ వ్యవసాయ అధికారి 8977753903, చౌదరిగూడ అధికారి 8977753904, కేశంపేట మండల వ్యవసాయ అధికారి 8977753923, కొందుర్గు మండల వ్యవసాయ అధికారి 8977753924, కొత్తూర్ మండల వ్యవసాయ అధికారి 8977753925, నందిగాం మండల వ్యవసాయ అధికారి 8977753926 నంబర్లను ప్రభుత్వం అందించినట్టు ఏడీఏ రాజరాత్నం తెలిపారు. ఆయా మండలాల పరిధిలో రైతులు మారిన నంబర్లలో అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు. ఆయా మండల అధికారులు రైతులకు అందుబాటులో ఉంటారని, ఎలాంటి సమస్యలు ఉన్న పైన ఇచ్చిన నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఆస్తి పన్ను చెల్లించి రాయితీ పొందండి

మున్సిపల్ కమిషనర్ సునీత

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఇళ్ల యజమానులు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఈ నెల 30వ తేదీ వరకు చెల్లిస్తే 5శాతం రిబేటును పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ సునీత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. ఇంటి పన్నులను ఆలస్యంగా చెల్లిస్తే వడ్డీ విధిస్తామని తెలిపారు. ఇంటి యజమానులు కార్యాలయానికి వచ్చి నేరుగా కాని, మున్సిపల్ ఆన్‌లైన్ యాప్ ద్వారా కాని పన్నులు చెల్లించవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఇస్తున్న ఆస్తి పన్ను చెల్లింపులో రిబేటును అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రాజీవ్ యువ వికాస్ గడువు పొడిగింపు

ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్‌రూరల్: నిరుద్యోగుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకానికి ఈ నెల 14వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవచ్చని మండల అభివృద్ధి అధికారి సంధ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు సబ్సిడీ కింద రుణాలు ఇవ్వడానికి ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకానికి ప్రభుత్వం 14వ తేదీ వరకు గడువును పొడిగించిందని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే ప్రతీ అభ్యర్థి ఆధార్ కార్డు, కుల, ఆదాయ పత్రం తప్పనిసరి(అన్ని కులాల వారికి), పాన్ కార్డు, ఫొటో, లబ్ధిదారుడి ఫోన్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అతిథి గృహం.. నిరుపయోగం

- ఎనిమిదేళ్లుగా మూసి ఉన్న భవనం
- లక్షల ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికారులు



మొయినాబాద్‌లోని పంచాయతీరాజ్ అతిథి గృహం

మొయినాబాద్: లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన పంచాయతీరాజ్ అతిథి గృహం నిరుపయోగంగా మారింది. ప్రారంభించి సుమారు ఎనిమిదేళ్లు దాటినా ఎవరికీ ఉపయోగం లేకుండా ఎప్పుడూ తాళం వేసే ఉంటుంది. మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పాత మహిళా సమాఖ్య భవనానికి 2016లో మరమ్మతులు చేసి పంచాయతీరాజ్ అతిథి గృహంగా మార్చారు. అందుకోసం మండల పరిషత్ నుంచి రూ.10లక్షల వరకు ఖర్చు చేశారు. భవనానికి మరమ్మతులు చేయడంతో పాటు పూర్తిస్థాయి ఫర్నిచర్ ఏర్పాటు చేసి 2017లో అతిథి గృహాన్ని ప్రారంభించారు. కానీ ఆ గృహాన్ని వినియోగించింది మాత్రం లేదు. నాలుగైదుసార్లు అప్పటి జెడ్పీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు ఉపయోగించారు. తర్వాత అతిథి గృహానికి తాళం వేసి పెట్టారు. గత నాలుగు సంవత్సరాల నుంచి అతిథి గృహాన్ని తెరిచిందిలేదు. లక్షల రూపాయల ఖర్చుచేసి నిర్మించిన అతిథి గృహం నిరుపయోగంగా మారడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అతిథి గృహాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందిస్తున్న మాజీ సర్పంచ్ వెంకటయ్యగౌడ్

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయానికి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎదిరే వెంకటయ్యగౌడ్ రూ.8లక్షల విరాళం ప్రకటించారు. బుధవారం ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులకు విరాళానికి సంబంధించిన చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర కలిగిన అయ్యప్ప ఆలయాన్ని పునర్నిర్మించడం చాలా గొప్ప విషయమన్నారు. ఆలయ నిర్మాణంలో భాగంగా గుడి పైకప్పు నిర్మించేందుకు రూ.8లక్షలు అవసరం అవుతున్నాయని తెలియడంతో ఆ డబ్బులను తాను విరాళంగా అందించినట్లు తెలిపారు. అనంతరం దాత వెంకటయ్యను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురుస్వాములు గిరిషన్‌నాయర్, సుదర్శన్‌గౌడ్, అశోక్, ఈట గణేశ్, లక్ష్మయ్యయాదవ్, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, దేపల్లి కుమార్‌గౌడ్, కృష్ణ, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషి

టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్



చేవెళ్లలో నివాళులర్పిస్తున్న నాయకులు

చేవెళ్ల: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మహారాజ్ ఆశయ సాధనకు కృషి చేయాలని టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం వద్ద బుధవారం ఆయన 315వ వర్ధంతిని పురస్కరించుకొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుజన ఆత్మగౌరవానికి ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ప్రతీకగా నిలిచారని, సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం ఎంతో కృషి చేసిన ఆయన చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఆయన చూపించిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని సూచించారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండుయాదవ్, నాయకులు ప్రకాశ్‌గౌడ్, బాలయ్య, జనార్దన్, సాయికిరణ్, యాదగిరిగౌడ్ ఉన్నారు.

చలో సెక్రటేరియేట్‌ను విజయవంతం చేయండి

షాద్‌నగర్: వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే చలో సెక్రటేరియట్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాశ్‌నాయక్ ఒక ప్రకటనలో కోరారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన భూమిని కాపాడేందుకు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు, విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

షాబాద్: యువత సమాజ సేవలో పాలుపంచుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చందనవెళ్లి గ్రామంలో ఆకుల మనోహర్ జన్మదినం సందర్భంగా బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికుల కోసం వేసవి కాలంలో దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో న్యాయవాది బాలకిషన్, మహేందర్‌రెడ్డి, గోపాల్, రామస్వామి, నర్సింలు, వెంకటేశ్, రాంచందర్ ఉన్నారు.

ఎల్ఆర్ఎస్ గడువు పొడిగింపు

ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం 2020(ఎల్ఆర్ఎస్) గడువును పెంచిందని ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. గతంలో మార్చి 31 వరకు ప్రభుత్వం 25శాతం సబ్సిడీ కల్పించిందన్నారు. గడువు ముగియడంతో మళ్లీ ఏప్రిల్ 30 వరకు పెంచిందని తెలిపారు. అప్పటివరకు 25శాతం సబ్సిడీ అర్హులకు వర్తిస్తుందన్నారు. మండలంలో అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మండల కేంద్రంలో ఎల్ఆర్ఎస్‌కుగాను ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్టు ఎవరికైనా సందేహాలు ఉంటే సంప్రదించాలని ఆయన కోరారు.

హెచ్‌సీయూ భూముల జోలికి రావొద్దు

విద్యార్థి నరేందర్

కేశంపేట: హైదరాబాద్ విశ్వవిద్యాలయం(హెచ్‌సీయూ) భూములను రాష్ట్ర ప్రభుత్వం తీసుకునేందుకు ప్రయత్నిస్తుందని, వాటి జోలికి రావొద్దని హెచ్‌సీయూలో విద్యనభ్యసిస్తున్న మండల పరిధిలోని కోనాయపల్లి గ్రామానికి చెందిన సొప్పరి నరేందర్ అన్నారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అగ్రికల్చర్ యూనివర్సిటీ భూముల్లో నుంచి 100 ఎకరాలను హైకోర్టు నిర్మాణానికి కేటాయించిందన్నారు. అది మరవక ముందే మళ్లీ హెచ్‌సీయూ భూములను విక్రయించడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. హెచ్‌సీయూలో జింకలు, సింహాలు ఉన్నట్టు హంగామా చేస్తున్నారని, రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడిన మాటలను కాంగ్రెస్ అనుబంధ సంఘమైన ఎన్ఎస్‌యూఐ ఖండించిందన్నారు. తెలంగాణ మొదటి దశ ఉద్యమంలో ఇక్కడి ప్రజలను శాంతింపజేసేందుకు అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హైదరాబాద్‌కు కేంద్రీయ విశ్వ విద్యాలయం మంజూరు చేసిందన్నారు. యూనివర్సిటీ నిర్మాణానికి 2000ల ఎకరాలు అవసరం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం 2324 ఎకరాల భూమిని కేటాయించిందన్నారు. 1970లోనే యూనివర్సిటీ చుట్టూ అప్పటి వైస్ ప్రిన్సిపాల్ గురుబక్స్ కోటి రూపాయలతో ప్రహరీని నిర్మించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంకు విద్యా వ్యవస్థపై చిత్తశుద్ధి ఉంటే యూనివర్సిటీ భూముల వద్దకు రావొద్దని ఆయన కోరారు.

ప్రశ్నించే గొంతును నొక్కేస్తున్నారు

కొందుర్గు: పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రభుత్వం ప్రశ్నించే గొంతును నొక్కేస్తుందని జిల్లేడ్ చౌదరిగూడ మండల ఎల్‌హెచ్‌పీఎస్ అధ్యక్షుడు రామ్‌చరణ్‌నాయక్ అన్నారు. బుధవారం పోలీసులు ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఎల్‌హెచ్‌పీఎస్ సీఎం ఇంటి ముట్టడికి పిలుపునిస్తే పోలీసులు హౌజ్ అరెస్టు చేయడం బాధాకరమన్నారు. అరెస్టు అయిన వారిలో వివిధ గ్రామాల ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు ఉన్నారు.

రక్షణ కల్పించాలని ఫిర్యాదు



ఫిర్యాదును చూపుతున్న శ్రీనివాస్

కేశంపేట: ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్‌తో పాటు అతడి అనుచరుల నుంచి తనకు ప్రమాదం ఉందని, రక్షణ కల్పించాలని మండల పరిధిలోని కాకునూర్ గ్రామానికి చెందిన సొంటె శ్రీనివాస్ శంషాబాద్ డీసీపీకి బుధవారం ఫిర్యాదు చేశారు. గతంలో డీఎస్పీలో విశారదన్‌తో కలిసి పార్టీలో పని చేసినట్టు ఆయన ఫిర్యాదులో తెలిపారు. ఆ సమయంలోనే విశారదన్ విధానపరమైన తప్పులను, ఉద్యమం మాటున అతను చేస్తున్న ఆర్థికపరమైన అవకతవకల విషయంలో ఇద్దరికి విబేధాలు వచ్చాయన్నారు. ఇటీవల కాలంలో కొన్ని మీడియా ఛానల్స్‌కు ఇంటర్వ్యూలు ఇస్తున్న సందర్భంలో విశారదన్‌కు సంబంధించిన అనేక విషయాలను ప్రజలకు తెలిపానన్నారు. దీంతో విశారదన్ తన అనుచరులతో తనపై భౌతికదాడులు చేస్తామని బంధువులు, స్నేహితులకు ఫోన్లు చేసి పరోక్షంగా బెదిరింపులకు పాల్పడుతున్నట్టు పేర్కొన్నారు. విశారదన్‌తో పాటు అతడి అనుచరుల నుంచి తనకు ప్రమాదం ఉందని రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



పోలీసుల అదుపులో రాంబాల్‌నాయక్

కేశంపేట: లంబాడీ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్‌తో ముఖ్యమంత్రి ఇంటి ముట్టడికి లంబాడీ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) పిలుపు ఇవ్వడంతో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాంబాల్‌నాయక్, దేవుజాలను పోలీసులు బుధవారం ముందస్తు అరెస్టు చేశారు. ముఖ్యమంత్రి ఇంటి ముట్టడికి వెళ్తున్న వారిని మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఉన్న పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

రైతుల అభివృద్ధికి చర్యలు

సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి



రైతుకు ఇన్సూరెన్స్ చెక్కును అందజేస్తున్న శేఖర్‌రెడ్డి

షాబాద్: రైతుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని సహకార సంఘం చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో నాందార్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన మేకల సరస్వతీ సహకార బ్యాంక్‌లో ఎల్‌టీ లోన్ తీసుకుంది. ఫిబ్రవరి నెలలో తన పాడి ఆవు ప్రమాదవశాత్తు మృతి చెందింది. దీంతో రైతుకు ఇన్సూరెన్స్ కింద రూ.95వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహకార బ్యాంక్‌లో ఎల్‌టీ లోన్ తీసుకున్న ప్రతి రైతు పశువులకు ఇన్సూరెన్స్ చేస్తామని, దీంతో వారికి పాడి పశువులు మృతి చెందింతే వారికి డబ్బులు వచ్చాయన్నారు. ఎల్‌టీ లోన్ తీసుకున్న ప్రతీ రైతు పశువులకు ట్యాగ్ వేయాలన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం సీఈఓ శివకుమార్‌రెడ్డి, నాయకులు రాంచందర్, మహేందర్ తదితరులు ఉన్నారు.

బజరంగ్‌దళ్ నగర కమిటీ ఎన్నిక



షాద్‌నగర్: నూతన సభ్యులను సన్మానిస్తున్న బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు

షాద్‌నగర్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో గల జగన్నాథస్వామి దేవాలయంలో బుధవారం విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) విభాగ్ సహ కార్యదర్శి మఠం రాచయ్య ఆధ్వర్యంలో బజరంగ్‌దళ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బజరంగ్‌దళ్ నూతన నగర కమిటీని ప్రకటించారు. నగర కమిటీ సంయోజక్‌గా కుమ్మరి వినయ్‌కుమార్, సహ సంయోజక్‌గా కుర్వగడ్డ భాను, విద్యార్థి ప్రముఖ్‌లుగా కొక్కు రాము, కొక్కు గణేష్, గోరక్ష సహ ప్రముఖ్‌లుగా ప్రేమ్‌కుమార్, విశ్వనాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు కండువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ బజరంగ్‌దళ్ విభాగ్ సంయోజక్ గూడెం రమేశ్, నాగిళ్ల ప్రభాకర్, వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు సందీప్‌కుమార్, నగర ప్రధాన కార్యదర్శి వాద్యాల రుషికేశ్, మల్లికార్జునప్ప బజరంగ్‌దళ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మండల సంయోజక్‌గా విజయ్ పాండు

మొయినాబాద్: బజరంగ్‌దళ్ మండల సంయోజక్(అధ్యక్షుడి)గా విజయ్ పాండు ఎన్నికయ్యారు. బుధవారం మొయినాబాద్ శివాలయంలో బజరంగ్‌దళ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల సంయోజక్ విజయ్ పాండుతో పాటు సహ సంయోజక్‌లుగా శ్రీధర్, శ్రావణ్, విద్యార్థి ప్రముఖ్‌లుగా సాయి కోటి, నితిన్, బిందు, కిరణ్, సురక్ష ప్రముఖ్‌గా శివకుమార్, బలోపాసన ప్రముఖ్‌గా శివయాదవ్, గోరక్ష ప్రముఖ్‌లుగా నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, భరత్ యాదవ్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా సహ ప్రముఖ్ రమేశ్‌చారి, సురక్ష ప్రముఖ్ సురేశ్‌గౌడ్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత



హనుమాన్ దీక్ష తీసుకున్న భక్తులతో అర్చకుడు వాసుదేవాచార్యులు

చేవెళ్ల: ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని అర్చకుడు వాసుదేవాచార్యులు అన్నారు. మున్సిపాలిటీలోని హనుమాన్ దేవాలయంలో బుధవారం చేవెళ్లకు చెందిన హనుమాన్ భక్తులు హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ మాలలు ధరించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమాన్ దీక్షతో ఏకాగ్రత సిద్ధిస్తోందని, నిత్య పూజలతో భగవంతుడి అనుగ్రహం పొందుతారన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవాటు చేసుకోవాలని సూచించారు. హనుమాన్ దీక్ష తీసుకోవటం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో రాఘవేందర్, జగదీశ్వర్‌రెడ్డి, విశ్వరూపచారి, చంద్రశేఖర్, వెంకటేశ్, నర్సింలు, సురేశ్, శ్రీపాల్, మహేందర్, సాయిగణేశ్, సురేందర్, నాగశివచారి తదితరులు ఉన్నారు.

బుగ్గరామేశ్వరస్వామి దేవాలయంలో పూజలు



నందిగోల ఊరేగింపులో భక్తులు

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని బుగ్గరామేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ వెంకటయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో గల బుగ్గరామేశ్వరస్వామి దేవాలయం వద్ద నందిగోల ఊరేగింపు, అగ్ని గుండాల కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సుభాశ్‌చంద్రబోస్, ఆలయ సభ్యులు, అర్చకులు, గ్రామస్తులు ఉన్నారు.

నిరుపేదలకు అండగా ప్రభుత్వం

సన్నబియ్యం పంపిణీలో నేతలు



షాద్‌నగర్: లింగారెడ్డిగూడలో బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అండగా నిలుస్తోందని పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్‌గౌడ్, సురేశ్‌గౌడ్, మల్లేశ్‌యాదవ్, గణేశ్‌యాదవ్, ఫకీర్‌పాషా, హరికృష్ణ, యాసిన్, కావలి రఘు, లక్ష్మయ్య, వినోద్, సిద్ధి శ్రీధర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లలో పండగ వాతావరణం

చేవెళ్ల: ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంతో లబ్ధిదారుల ఇళ్లలో పండగ వాతావరణం తీసుకొచ్చిందని ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముడిమ్యాల గ్రామంలోని రేషన్ దుకాణంలో బుధవారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. అదేవిధంగా తంగడపల్లి గ్రామంలోని రేషన్ దుకాణంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండుయాదవ్ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, రాములు, వాజిద్, వినోద్, ఖాజామొహినొద్దీన్, మాధవ్‌రెడ్డి, మల్లప్ప, శంకర్‌గౌడ్, హైమద్, శ్రీనివాస్‌గౌడ్, రవి, రాంచంద్రయ్య, లక్ష్మయ్య, శ్రీనివాస్, సధాకర్‌గౌడ్, రమేశ్, తదితరులు ఉన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

షాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తిర్మలాపూర్, సర్దార్‌నగర్, నాగర్‌గూడ, పెద్దవేడు, చందనవెళ్లి తదితర గ్రామాల్లో రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీరాంరెడ్డి, నర్సింలుగౌడ్, కొమరబండ దేవాయల చైర్మన్ చేవెళ్ల వెంకటయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పామెన నర్సింలు, సహకార సంఘం మాజీ చైర్మన్ బండ మహేందర్‌గౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు.

నాగులపల్లి, వెలిజర్ల గ్రామాల్లో..

మండల పరిధిలోని నాగులపల్లి, వెలిజర్ల గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాండుగౌడ్, నర్సింహారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌రెడ్డి, రాములుగౌడ్, నర్సింహ్మారెడ్డి, వెంకటేష్, నర్సింలుగౌడ్, శివరాములు, బోరయ్య, సంతోష్‌రెడ్డి, తిరుపతయ్య, జాంగారి జంగయ్య, శివరాజ్‌గౌడ్, గణేష్‌గౌడ్, ముకుందగౌడ్, అన్వర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పేదల ప్రభుత్వం

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తుందని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలో రేషన్‌షాపు వద్ద సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని డైరెక్టర్ బాలకృష్ణారెడ్డి మాజీ సర్పంచ్‌లతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, ఆకుల పద్మారావు, రత్నం, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మర్రి రవీందర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



షాబాద్: నాగర్‌గూడలో బియ్యం అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి



చేవెళ్ల: ముడిమ్యాలలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



మొయినాబాద్‌రూరల్: బియ్యం పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలకృష్ణారెడ్డి